న్నారు. నేను యథోచితంగా సమాధానాలు చెబుతున్నాను. అరగంట యింది. గంటయింది. ప్రఖ్యాత సినీతార 'రోతశ్రీ'గారు షూటింగ్ పూర్తి చేసుకుని ఇప్పుడే బయలు దేరారనీ, ఇంకో ఇరవై నిముషాల్లో సభకి చేరుకుంటారనీ కబురొచ్చింది. ఈ లోగా కరెంటు పోయింది. అంతా గందర గోళం, చీకటి, హడావిడి. ఆ చీకట్లోనే కాలక్షేపానికి ఒక ఔత్సాహిక గాయని చేత సినిమా పాటలు పాడించారు.

సినీతార 'రోతశ్రీ' గారు రావడం కరెంటు రావడం ఒకేసారి జరిగింది. అదృష్ట దీపం వెలిగినట్లు ఆనందించారు అందరూ.

సభ ఆరంభమైంది. వేదిక మీదకి ఆ సభకి అధ్యక్షురాలైన ప్రఖ్యాత జోస్య కారిణి అభయాంబ గారినీ, ప్రసిద్ధ గాయని కీచుబాయి గారినీ, 'విహ్వల భారతి' సంస్థాపకురాలు, మహిళాలోకానికి ఎనలేని సేవ చేస్తున్న అకుంఠితాదేవి గారినీ, ప్రఖ్యాత సినీతార 'రోతశ్రీ' గారినీ నన్నూ ఆహ్వానించింది 'విహ్వలభారతి' కార్యదర్శి. కొంచెం ఆలస్యంగా రొప్పుకుంటూ వచ్చిన భయానక, హింసాత్మక, సంచలనాత్మక నవలా రచయిత్రి శ్రీమతి ఘటికవల్లిగారు కూడా కార్యదర్శి ఆహ్వానాన్ని పురస్కరించుకుని వేదికని అలంకరించారు.

జోస్యకారిణి అభయాంబ గారు సభని ప్రారంభిస్తూ, నా గురించి మాట్లాడడం మొదలు పెట్టారు '...నిజం చెబుతున్నాను. శ్రీమతి అసావేరి ఇంతటి ఘన సన్మానాన్ని అందుకోగలదని నేను అనుకోలేదు. ఈమె నాకు చిన్నపిల్లప్పటి నుంచీ తెలుసు. మా ఇంటి పక్కనే ఉండేది పిఠాపురం పెంటపాడు గ్రామంలో. చీమిడి ముక్కు తుడుచుకుంటూ, చెడ్డీ ఎగలాక్కుంటూ, తొక్కుడుబిళ్ళ ఆడుతూండేది మా ఇంటిముందు. అటువంటి

చిన్నారి ఈనాడు మహారచయిత్రిగా సన్మానాన్ని పొందడం నిజంగా నా జ్యోస్య ఫలితం కాదు. ఆమె పూర్వజన్మ సుకృతం అనే నమ్ము తున్నాను. పట్టుమని పది కథలైనా రాయని ఈ మహారచయిత్రికి ఆమె రాశిని చూసి కాక, వాసిని చూసి అనుకుంటాను-'విహ్వల భారతి' అధి నేతలు ఉదారంగా చేస్తున్న ఈ సన్మానానికి వారిని అభినందిస్తున్నాను. ముందు ముందు మరెంతో మంది మహిళలు ఈ విధంగా' విహ్వలభారతి' ఔదార్యానికి నోచుకోగలరని జోస్యం చెబుతున్నాను...' అందరూ చప్పట్లు కొడుతూంటే వెర్రిమొహం వేసుకుని చూశాను.

ఇప్పుడు, ప్రఖ్యాత సినీతార, ఆంధ్రుల ప్రియతమతార 'రోతశ్రీ' గారు శ్రీమతి అసావేరి గారికి పూలమాలవేసి శాలువా కప్పి సత్కరిస్తారు అనేసరికి మళ్ళీ కరతాళ ధ్వనులు. ఇంతలో ఇద్దరు 'విహ్వల' వనితలు పెద్ద పూలమాలని మోసుకుంటూ వచ్చారు. మరొకరు పళ్లెంలో శాలువా పెట్టి పట్టుకొచ్చారు. ఆ దండ నా మెడలో పడడానికి 'రోతశ్రీ' గారికి ఆ ఇద్దరు వనితలూ సాయం చేశారు. అసలే సిగ్గుతో వంగిన నా మెడ మరింత క్రుంగిపోయింది. దానికి తోడు శాలువా కప్పారు. అయినా నా వొణుకు తగ్గలేదు!

ఆ తరవాత, నృత్యకార్యక్రమం ఉంటుందనీ, అయినా, వేదిక మీద ఎక్కడి వాళ్లక్కడే ఉంటారనీ, వారిముందే బేబీ చిట్టిమాలిని బ్రేక్ డాన్స్ చేస్తుందనీ, ఇదొక కొత్త ప్రయోగం అనీ, బేబీ చిట్టిమాలిని ఎవరో కాదు, అకుంఠితాదేవిగారి ముద్దుల మనవరాలేననీ చెప్పారు. అంతా జేజేలు పలికారు....డాన్స్ పూర్తికాగానే 'రోతశ్రీ' గారు కుర్చీలోంచి లేచి, ముందు

కెళ్లి చిట్టిమాలినిని అమాంతం ఎత్తుకుని ముద్దుపెట్టుకుని, 'నా అంతటి దానివవుతావ'ని ఆశీర్వదించారు. అందరూ ఒకటే చప్పట్లు!

తరవాత 'రోతశ్రీ' గారు ప్రసంగిస్తారని అధ్యక్షురాలు ప్రకటించారు. 'రోతశ్రీ' గారు దరహాసంతో నా వైపు క్రీగంట చూసి సభలోని ప్రేక్షకులను చూసి మందహాసం చేసి, 'ఈనాడు ఈ సన్మానసభకి నన్నెందుకు ఆహ్వానించారో నాకు తెలుసు! సభాలంకరణకి నా 'గ్లామర్' కూడా తోడైతే బావుంటుందని కదూ! (అంతా చప్పట్లు)....నిజానికి నేను ఈ రచయిత్రి కథలను ఒక్కటికూడా చదవలేదు. అసలు నేనేమీ చదువుకోలేదు కదా! (మళ్లీ చప్పట్లు)....చదువుకోక పోయినా సంస్కారం, లోకజ్ఞానం లేని దాన్ని కాదు....ఎన్నికథలు పత్రికల్లో అచ్చయినా, నాలాంటి వారిదాకా ఆ కథలు చేరాలంటే, సినిమాలకి కథలు రాయాలి. ఈమె ఎప్పుడైనా ముందు ముందు హీరోయిన్ పరంగా కథరాస్తే, దాన్ని సినిమాగా తియ్యమని ఎవరైనా ప్రొడ్యూసర్ గారికీ, డైరెక్టర్ గారికి రికమెండ్ చేస్తానని ఈ సభాముఖంగా హామీ ఇస్తున్నాను....' చప్పట్లతో సభ మారుమోగిపోయింది. ఆ ఉత్సాహంతో 'విహ్వలభారతి' కార్యదర్శి పరుగు పరుగున వేదిక మీదికొచ్చి, నామెడలో అంతకు ముందు వేసిన ఆ పది కిలోల హారాన్ని బల్లమీంచి తీసి 'రోతశ్రీ' గారి మెడలో వేసేసింది....సభలో కేరింతలు!

'రోతశ్రీ' గారు కూర్చున్నాక, 'విహ్వల భారతి' సంస్థాపకురాలు అకుంఠితాదేవి గారిని ప్రసంగించవలసిందిగా సభాధ్యక్షురాలు కోరారు. ఆమెలేచి ప్రారంభించారు.

'ఈ సంస్థని స్థాపించి అయిదేళ్లయింది. ప్రతి ఏడూ ఒక ప్రముఖ మహిళకి సన్మానం చేస్తున్నాం. ఈ ఏడు ఒక రచయిత్రికి చెయ్యాలనుకున్నాం. ఎవరికి చెయ్యాలన్న మీమాంస వచ్చింది ఆసావేరి గారి పేరుని ఎవరో సూచించారు. కమిటీ వాళ్లు కొందరు ఒప్పుకోలేదు—మరీ అంత పేరు లేనావిడకి చెయ్యడం ఏమిటని. నేనే అందరినీ ఒప్పించాను—ఊరూ పేరూ లేని వాళ్లని పైకి తీసుకురావడమే మన సంస్థ చెయ్యవలసినపని అని చెప్పి. ఇంకొక విషయం కూడా చెప్పాలి. నేను ఈవిడ కథలన్నిటినీ చదవలేదు. 'అత్యాచారం' కథ చదివాక ఈ రచయిత్రి మీద అభిమానం కలిగింది. సాధారణంగా కథల్లో రచయిత్రుల అనుభవాలు ఎంలో కొంత ఉండక పోవంటారు. ఆసావేరి గారికి అనుభవం లేకపోతే అంత మంచి కథని రాయగలిగే వారు కాదేమోనని నా అనుమానం! ఈ సన్మానం వల్ల కలిగిన స్ఫూర్తితో ఎన్నో గొప్ప కథల్ని రాయగలుగుతారని కమిటీ వాళ్లకి చెప్పాను (అంతా చప్పట్లు)....నా నమ్మకాన్ని వమ్ము చెయ్యరని ఆశిస్తున్నాను' అంటూ నా వైపు చూశారు. నేను చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించాను.

ఆకుంఠితా దేవి గారి ప్రసంగానంతరం, ప్రముఖ రచయిత్రి ఘటికవల్లి గారి ఉపన్యాసం మొదలైంది 'ఇది నవలా కాలం. సీరియల్స్ కోసం ఎదురు చూడని పాఠకులు లేరు. కథలకు కాలం చెల్లిపోయిన ఈ రోజుల్లో పట్టుమని పది కథలైనా రాయని ఈ ఆసావేరి గారిని సన్మానించడానికి సాహసం చూపించిన 'విహ్వల భారతి' అధ్యక్షురాలిని మనసారా అభినందిస్తున్నాను.'

కరతాళధ్వనుల మధ్య కూర్చుందావిడ. తరవాత, ప్రఖ్యాతగాయని కీచుబాయిగారు — 'అబలంటే ఆడది' సినిమాలో పాడిన 'మానం ఉంటే అనుమానం, మానం ఉంటే అవమానం....' అనే తన 'హిట్ సాంగ్'ని పాడి సభికుల్ని రంజింపజేశారు. అంతటితో తృప్తి పడలేదు ఆహూతులు. ఇంకా ఎన్నో 'హిట్‌సాంగ్స్' పాడిందాకా వదల్లేదు.

అప్పటికే ఎంతో కాలాతీతమైపోయిందని ముందు వరసలో కూర్చున్న ముఖ్యఅతిథులెందరో కుర్చీలు ఖాళీగా వదిలిపెట్టి వెళ్లిపోయారు. సభాధ్యక్షురాలు నావైపు చూసి, నా చేతిలో ఉన్న కాగితంవైపు దృష్టి కేంద్రీకరించి, కార్యదర్శి ధన్యవాదాలు చెప్పవలసిన జాబితా చాలా పెద్దదిగా ఉన్నందువల్ల నన్ను త్వరగా నాలుగు ముక్కలు మాట్లాడమన్నారు.

నేను లేవగానే చెదురు మదురుగా చప్పట్లు వినిపించాయి. సభామర్యాదలు పాటించాక, ఇలా చెప్పాను. 'అప్పుడప్పుడు తపన ఆపుకోలేక ఏవో కథలు రాస్తూ ఇంటి పట్టున ఉన్న నన్ను బయటికి లాగి ఈ వేదిక నెక్కించిన వారందరికీ నా ధన్యవాదాలు! నేనురాసిన కథలోని అత్యాచారం లాంటిది నా కంతకు ముందు అనుభవమేనని మీలో కొందరి అభిప్రాయం కావచ్చు. దాని మాట ఎలా ఉన్నా, ఈనాడు నాకు జరిగిన ఈ అనుభవం అంతకన్న మించినదని మాత్రం గట్టిగా చెప్పగలను. ఈ జన్మ కీ అనుభవం చాలు నాకు! నమస్కారం.'

